గుక్కెడు నీటికి నోచుకోని..
బుక్కావీధి ప్రజలు

మురుగు నీటిలోనే మంచినీటి కుళాయి పైపులైన్లు



చెత్తా చెదారం మధ్య మంచినీటి పైప్‌లైన్లు

దాబాగార్డెన్స్: కనీస సౌకర్యాల కల్పనలో కూటమి ప్రభుత్వం విఫలమైందంటూ జీవీఎంసీ 38వ వార్డు బుక్కావీధి వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొంతెమ్మ కోరికలు కోరకపోయినా.. కనీసం తాగునీటిని కూడా సక్రమంగా ఇవ్వడంలో ఈ ప్రభుత్వం చేతులెత్తేసిందని.. ఇందుకు నిదర్శనమే కలుషిత తాగునీటి వల్ల గత ఆరు నెలలుగా ఈ ప్రాంతంలో పలువురు ఆస్పత్రి పాలయ్యారని.. మరి కొంత మంది అనారోగ్యంతో మంచాన పడ్డారంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అనేక మంది అనారోగ్యంతో బాధ పడతున్నారు. ముందుగానే చర్యలు తీసుకుంటే మాకీ గతి పట్టేది కాదు కదా.. అంటూ మండిపడుతున్నారు.



బుక్కావీధిలో నిరసన తెలుపుతున్న స్థానిక మహిళలు (ఫైల్) (ఇన్‌సెట్) ఇటీవల గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన లేఖ

జీవీఎంసీ 38వ వార్డు బుక్కావీధిలో గత కొంత కాలంగా తాగునీటి పైపులు ద్వారా మల, మూత్రాలతో కలిసి మురుగు నీరు వచ్చేస్తోంది. ఫలితంగా ఈ ప్రాంతంలో అనేక మంది రోగాల బారిన పడగా.. మరి కొంత మంది ఆస్పత్రి పాలయ్యారు. ఇంకొందరు ఇంకా మంచానే ఉన్నారు.

ఇంత జరుగుతున్నా.. అధికారుల్లో స్పందన లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న పాపాన పోలేదని ఆ ప్రాంత వాసులు లబోదిబోమంటున్నారు. తామంతా మురుగు నీరు తాగాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరసన బాట..

బుక్కావీధిలో మంచినీటి సమస్య పరిష్కరించాలంటూ స్థానిక మహిళలు గత బుధవారం బుక్కావీధిలో నిరసన చేపట్టారు. నిరసనను ఉద్దేశించి సిటు నాయకుడు ఎం.సుబ్బారావు మాట్లాడారు. విశాఖపట్నాన్ని మరో సింగపూర్, ముంబై చేస్తామని చంద్రబాబునాయుడు చెబుతున్నారని, తాగునీరే సరఫరా చేయలేని ఈ కూటమి ప్రభుత్వం నగరాన్ని ఇంకేమి ఉద్ధరిస్తుందని ప్రశ్నించారు. నెలల తరబడి మంచినీటి సమస్యపై మహిళలు నిరసన తెలియజేస్తున్నా జీవీఎంసీ అధికారుల్లో చలనం లేకపోవడం సిగ్గుచేటన్నారు. 38వ వార్డులో రోడ్లన్నీ తవ్వేసి, నెలలు.. సంవత్సరాలు గడుస్తున్నా బాగు చేయకుండా పాలకులు, జీవీఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని ఆరోపించారు. తాగునీటి పైపులైన్ల ద్వారా మురుగు నీరు వచ్చేస్తుందని అనేక సార్లు అధికారులు, ప్రజాప్రతినిదులకు తెలిపినా కనీస స్పందన లేదన్నారు.



కలుషిత నీటిని చూపుతున్న స్థానికులు

జీవీఎంసీ సరఫరా చేసే మురుగునీటిని తాగి ఈ ప్రాంత వాసులు డయేరియాతో ఆసుపత్రి పాలవుతున్నారని, చిన్న పిల్లలు, గర్భిణులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మూడు నెలల కిందట కలెక్టర్‌ని కలిసి సమస్య మొరపెట్టుకుంటే.. నెలలో సమస్య పరిష్కరిస్తామని చెప్పి ఇప్పటి వరకు పరిష్కరించలేదన్నారు.



దుర్వాసన భరించలేకపోతున్నాం..

మేమున్నది మురికివాడ ప్రాంతం. ఎప్పటికప్పుడు కాల్వల్లో పేరుకుపోయిన చెత్త చెదారాలు తీయరు. కాల్వల్లో చెత్త పేరుకుపోవడంతో ఎక్కడికక్కడ మురుగు నీరు నిలిచిపోతుంది. ఫలితంగా పైపుల ద్వారా సరఫరా అయ్యే మంచినీటిలో మురుగు నీరు కలిసిపోతుంది. తాగే నీటి వల్ల అనేక రోగాలకు గురి కావల్సి వస్తోంది. దుర్వాసన భరించలేకపోతున్నాం.

– సూరాడ లక్ష్మి, బుక్కావారి వీధి,

మత్స్యకారులమని చిన్నచూపు..



తామంతా మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన వారిమని కార్పొరేటర్, జీవీఎంసీ అధికారులకు గాని చిన్నచూపు. చాలా కాలంగా మంచినీటి కుళాయిలో మల, మూత్రాలు కలిసి పోతున్నాయి. గత్యంతరం లేక అదే నీటిని తాగి అనేక రోగాల బారిన పడతున్నాం. ఈ విషయాన్ని అధికారులకు రాతపూర్వకంగా వినతిపత్రం అందజేశాం. అధికారులు వచ్చి చూశారు. కానీ సమస్య పరిష్కరించలేదు. కుళాయి వచ్చిన 10 నిమిషాల పాటు మల.. మూత్రాలు తప్ప మంచినీరు రావడం లేదు. ఇచ్చే అరగంటలో సగం నీరు రోడ్డు పాలవుతోంది. ఒక్కో కుళాయి మీద 10 నుంచి 15 కుటుంబాలు నీరు పట్టుకుంటున్నాయి.

– కర్రి చంద్రశేఖరం, అధ్యక్షుడు, ఏపీ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం

ఆకట్టుకున్న కల్లూరి శ్రీనివాస్ గాత్ర కచేరీ



ఆహుతులను అలరించిన విద్వాన్ శ్రీనివాస్ సంకీర్తనలు

దాబాగార్డెన్స్: రామ్‌నగర్ మెయిన్‌రోడ్డులోని శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో సోమవారం ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన విద్వాన్ కె. శ్రీనివాస్ గాత్ర కచేరీ ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని సంస్థ చైర్మన్ ఎ.వెంకట్రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గాయకుడు శ్రీనివాస్ కర్ణాటక సంగీతానికి సంబంధించి త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్ సంకీర్తనలు మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై ఎస్. పార్థివ, ఘటంపై ఏఎస్ఆర్ కౌండిన్య వాద్య సహకారం అందించారు. కచేరీ అనంతరం సంస్థ తరఫున విద్వాన్ శ్రీనివాస్‌ని, వాయిద్య కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో చైర్మన్ వెంకట్రావు, వైస్ చైర్మన్ కె. సుబ్రహ్మణ్యం, కార్యదర్శి పి.జగన్మోహనరావు, కోశాధికారి ఎం.మధుబాబు, సంయుక్త కార్యదర్శి వి.మధుసూదనరావు, ఎం.నాగేశ్వరరావు, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేడు అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

క్లుప్తంగా

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: సమస్యల పరిష్కారానికి ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని జీవీఎంసీ జోన్–4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. సోమవారం జోన్–4 కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తాగునీటి విభాగానికి 1, రెవెన్యూ విభాగానికి 3, టౌన్ ప్లానింగ్ విభాగానికి 1 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ గ్రీవెన్స్ సెల్ ద్వారా వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. సమస్యలపై వచ్చిన ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకూడదన్నారు. పరిష్కారమైన సమస్యలను నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, ఇంజినీరింగ్ అధికారి నర్సింహారావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఝాన్సీ, యూజీడీ, ఎలక్ట్రికల్ ఏఈలు, తాగునీటి విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వారిపై చర్యలకు డిమాండ్



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

మహారాణిపేట: కులం పేరుతో తిట్టి అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వై.రాజు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, లేని పక్షంలో సినిమా థియేటర్ ఎదుట ఆందోళన చేస్తామన్నారు. ఇప్పటికే ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించామన్నారు. సంఘం జిల్లా నాయకులు ఎం.సుబ్బారావు, కె.చంద్రోశేఖర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని సేక్రెడ్ హార్ట్స్ బాలికోన్నత పాఠశాలలో వేదంతా ఫౌండేషన్, వీజీసీబీ పోర్ట్ సంయుక్త సహకారంతో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి ఎమ్మెల్యే వంశీకృష్ణ ల్యాబ్‌ను ప్రారంభించారు. రూ.15 లక్షల విలువైన కంప్యూటర్ పరికరాలు, ల్యాప్‌టాప్‌లు, బోధన సౌకర్యాలను సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా కల్పించినట్లు ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఎయిడెడ్ పాఠశాలలో కంప్యూటర్ విద్య అందించేందుకు ముందుకు వచ్చిన వేదంతా ఫౌండేషన్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో వేదాంత సీఈవో సతీష్, సీఎస్ఆర్ వీజీసీబీ.లక్ష్మి, ఐతి మధుబాబు, భానోజీరావు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథ రథయాత్రకు మేయర్‌కు ఆహ్వానం



మేయర్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ ఈవో రాజగోపాల్‌రెడ్డి

దాబాగార్డెన్స్: టౌన్ కొత్తరోడ్డులో వేంచేసిన జగన్నాథస్వామి రథయాత్రకు మేయర్ పీలా శ్రీనివాసరావుకు ఆలయ ఈవో టి.రాజగోపాలరెడ్డి సోమవారం ఆహ్వానం పలికారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో ఆయనను కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. ఈ నెల 27 నుంచి వచ్చే నెల 7 వరకు నిర్వహించనున్న స్వామి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అందుకు జీవీఎంసీ తరఫున సహాయ సహకారాలుంటాయని మేయర్ పేర్కొన్నారు.

ఎస్సీ ప్రొఫెసర్‌పై కుల వివక్షను ఖండించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

మహారాణిపేట: తిరుపతి శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ డెయిరీ టెక్నాలజీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న షెడ్యూల్ కులానికి చెందిన వి. రవివర్మని ఆ కళాశాలలో అసోసియేట్ డీన్‌గా పని చేస్తున్న రవింద్రారెడ్డి కుల వివక్షతో ఇబ్బంది పెడుతున్నారని, ఈ విషయాన్ని భీమ్ సేన వార్ తీవ్రంగా ఖండిస్తుందని ప్రతినిదులు తెలిపారు. సోమవారం కంచరపాలెంలో ఉన్న భీమ్ సేన వార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రెసిడెంట్ కొరమాటి చిన్నారావు, జనరల్ సెక్రటరీ డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. కాలేజీలో అతని ఛాంబర్‌లో వేసిన టేబుల్, కుర్చీలు తొలగించి, కంప్యూటర్స్, ఫైల్స్‌ను ఇష్టం వచ్చినట్టు పడవేయించారన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన అసోసియేట్ డీన్ రవీంద్రరెడ్డిని వెంటనే సస్పెండ్ చేసి అతనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని రాజేంద్ర ప్రసాద్ కోరారు. ఈ సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ వి.వి. దుర్గారావు, జాయింట్ సెక్రటరీలు కొల్లబత్తుల ప్రసాదరావు, నామాల రేణు కుమార్, ట్రెజరర్ బల్లంకి కనకరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు కృష్ణకుమారి, ఎం. చంద్రశేఖర్, ఐజక్ తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ పనుల ప్రారంభానికి వినతి

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు పరిధిలో అర్ధంతరంగా నిలిచిపోయిన భూగర్భ డ్రైనేజీ పనులు ఇటీవల వివేకానందకాలనీలో చేపట్టినందుకు వార్డు మాజీ కార్పొరేటర్ పచ్చిరిపల్లి లక్ష్మీ రాము జోన్–4 కమిషనర్‌ను సోమవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వార్డులో మిగిలిన ప్రాంతాల్లో కూడా భూగర్భ డ్రైనేజీ పనులు నిలిచిపోయాయని, వాటిని కూడా ప్రారంభించాలని ఆమె కోరారు. వెంకటేశ్వరమెట్ట, బంగారుమెట్ట, అమ్మవారివీధి ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తి కాలేదని, వాటిని చేపట్టి పూర్తి చేయాలని ఈ సందర్భంగా వినతిపత్రం అందజేశారు.

మంచినీటి సరఫరా మెరుగుపరచండి..

33వ వార్డులో మంచినీటి సరఫరాను అన్ని ప్రాంతాలకు సమానంగా చేపట్టాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. కొన్ని ప్రాంతాలలో సన్నగా, మరి కొన్ని ప్రాంతాలలో ధారాళంగా నీరు వస్తున్నందున ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. దీనిపై క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

శ్రీవారి శంకుచక్రనామాలకు తొలగని ముసుగు



ఎంవీపీ టీటీడీ కూడలిలో ముసుగు వేసి వదిలేసిన శ్రీవారి శంకుచక్రనామాలు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ టీటీడీ కూడలిలో ఏర్పాటు చేసిన శ్రీవారి శంకుచక్రనామాల ముసుగు తొలగలేదు. కూడలి ఆధునికీకరణలో భాగంగా జీవీఎంసీ స్మార్ట్ వర్క్స్ విభాగం శంకుచక్రనామాలను ఏర్పాటు చేసింది. రెండు నెలలు గడుస్తున్నా.. నేటికీ వీటికి వేసిన ముసుగు తొలగించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. టీటీడీ కూడలి ఆధునికీకరణకు మరో 20 శాతం పనులు చేపట్టాల్సి ఉండగా.. బడ్జెట్ కేటాయింపు సమస్యలతో పనులు నిలిచిపోయాయి. ఈ కారణంగానే శంకుచక్రనామాలు పూర్తిస్థాయిలు ప్రదర్శించలేనట్లు సమాచారం. వర్షా కాలం నేపథ్యంలో ముసుగు తీయకుండానే శంకుచక్రనామాలు రంగు కోల్పోతాయేమోననే భక్తులు భావిస్తున్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి శ్రీవారి శంకుచక్రనామాలు కనువిందు చేసేలా అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

28న మేనేజ్‌మెంట్ విద్యపై సదస్సు

ఎంవీపీకాలనీ: మేనేజ్‌మెంట్ విద్యలో ఉన్నత ఉపాధి అవకాశాలపై ఎంవీపీ కాలనీలోని ఐఐఏఎం బీ స్కూల్ ఆధ్వర్యంలో ఈ నెల 28న సదస్సు నిర్వహించనున్నామని బీ స్కూల్ డైరెక్టర్ జనరల్ ఆచార్య వి.కృష్ణమోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'మేనేజ్‌మెంట్ విద్యలో కెరీర్ అవకాశాలు : స్కిల్ ట్రెండ్స్, మార్గాలు' అనే అంశంపై సదస్సు జరుగుతుందన్నారు. మేనేజ్‌మెంట్ విద్యలో తాజా ట్రెండ్స్‌పై నిపుణులు విద్యార్థులకు అవగాహన కల్పిస్తారన్నారు. దీనిలో విజయవంతమైన కెరీర్ నిర్మించుకోవడంపై విద్యార్థులకు నిపుణుల మార్గదర్శకత్వం ఉంటుందన్నారు. విద్యార్థుల సందేహాలకు సమాధానాలిస్తారన్నారు. ఆసక్తి గల నగరంలోని మేనేజ్‌మెంట్ కళాశాలల విద్యార్థులు త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల వృత్తిపరమైన అభివృద్ధికి ఈ సదస్సు ఎంతగానో దోహదపడుతుందని ఆచార్య కృష్ణమోహన్ పేర్కొన్నారు. నగర విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మత్తుకు బానిస కావద్దు



గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న నాసిన్ డైరెక్టర్ రవికిరణ్ తదితరులు

సీతంపేట: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా 'మత్తు వద్దు , బంగారు భవిష్యత్తే ముద్దు' అనే నినాదంతో బాలవికాస్ ఫౌండేషన్ రూపొందించిన గోడపత్రికను అక్కయ్యపాలెంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఇన్ డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (నాసిన్) కార్యాలయంలో సంస్థ డైరెక్టర్ ఈదర రవికిరణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతరం మత్తుకు బానిస కావొద్దంటూ బాలవికాస్ ఫౌండేషన్ విస్తృత ప్రచారం చేయడం అభినందనీయమన్నారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు నిత్యం గమనించాలని, అభిరుచి ఉన్న రంగంలో ప్రోత్సహించాలన్నారు. బాలవికాస్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ఈనెల 26న కళాశాలల్లో మాదకద్రవ్యాలపై యువతకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు.

'రామకృష్ణ థియేటర్‌ను వెంటనే కూల్చివేయాలి'

దాబాగార్డెన్స్: పాతనగరంలోని బౌదారా రోడ్డులో ఉన్న రామకృష్ణ పిక్చర్ ప్యాలెస్‌పై హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయడంలో జీవీఎంసీ నిర్లక్ష్యం పట్ల మేయర్ పీలా శ్రీనివాసరావును తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీ రామ్, వేగి రాధాకృష్ణ సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీవీ రామ్ మాట్లాడుతూ హైకోర్టు తీర్పు వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. తక్షణం రామకృష్ణ థియేటర్‌ను కూల్చివేయాలని డిమాండ్ చేశారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సేవలు ప్రశంసనీయం



డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న రవికుమార్ తదితరులు

మహారాణిపేట: దేశం కోసం బలిదానం చేసిన వ్యక్తుల్లో డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఒకరని, ఆయన నిజమైన దేశభక్తుడని బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్ అన్నారు. సోమవారం మహారాణిపేటలోని ప్రకృతి చికిత్సాలయం ఆవరణలో ఏపీ బీజేపీ వైద్య విభాగం, గాయిత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ 73వ బలిదాన దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. 52 సంవత్సరాల వయసులో దేశం కోసం బలిదానం చేసిన దేశభక్తుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ అన్నారు. కలకత్తా యూనివర్సిటీ ఉపకులపతిగా, ప్రధాని నెహ్రూ నేతృత్వంలో పరిశ్రమల శాఖ మంత్రిగా సేవలందించారని అన్నారు. 1953 జూన్ 23న ఆయన పరమపదించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర ఉపాధ్యక్షుడు చొక్కాకుల రాంబాబు, ఉపాధ్యక్షురాలు తలాడ గిరిజ, 182వ బూత్ అధ్యక్షురాలు చంద్రకళ, జగదీష్ , నగర ఎస్సీ నాయకులు దశమంతుల శ్రీను, రమణ, కొండమ్మ, బంగారమ్మ తదితరులు పాల్గొని శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పించారు.

యువత పోరుకు మేము సైతం..

- వార్డుల నుంచి తరలి వెళ్లిన కార్యకర్తలు



నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ శ్రేణులతో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: వైఎస్సార్‌సీపీ చేపట్టిన యువత పోరుకు నియోజకవర్గం అన్ని వార్డుల నుంచి యువత పెద్ద ఎత్తున పోటెత్తింది. ర్యాలీలు నిర్వహించి జిల్లా పరిషత్ జంక్షన్ నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు అబద్ధాల పుట్టని మరోసారి రుజువైందన్నారు. యువతకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ఏడాది గడిచినా ఆ ఊసే లేదన్నారు. పవన్ కల్యాణ్ కేవలం పోస్టర్లకు మాత్రమే పరిమితమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో పలు వార్డుల కార్పొరేటర్లు బిపిన్‌కుమార్ జైన్, తోట పద్మావతి, చెన్నా జానకీరామ్, కోడిగుడ్ల పూర్ణిమ, 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, 29వ వార్డు అధ్యక్షుడు పీతల వాసు, దశమంతుల మాణిక్యాలరావు, దొడ్డి బాపూ ఆనంద్, రాజారెడ్డి, 33వ వార్డు నాయకుడు ముత్తాబత్తుల రమేష్, అలపన కనకరెడ్డి, మహ్మద్ షకీల్, ఆకుల యేసు, గురజాపు రవి, ముజీబ్‌ఖాన్ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

34వ వార్డు నుంచి..

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో వార్డు నాయకులు, ఎర్నిమాంబ అమ్మవారి దేవస్థానం చైర్మన్ లండా రమణ, పార్టీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు దూడ అప్పారావుతో పాటు పార్టీ మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.

- 33వ వార్డు నాయకులు ముత్తాబత్తుల రమేష్, పచ్చిరిపల్లి రాము ఆధ్వర్యంలో వార్డు నాయకులు, కార్యకర్తలు వెంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ఆదారి వెంకట మహేష్, నియోజకవర్గం సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు సూర్య నాయుడు, బురుగుల చిన్న, సీనియర్ నాయకులు పి.వి.ఎస్ రెడ్డి, కృష్ణారెడ్డి, సంతోష్, మంగం పార్వతి, శ్రీనివాసరావు, పులి, సతీశ్, రంజిత్, సత్తిబాబు, కృష్ణ, యాసిన్ ర్యాలీగా తరలివెళ్లారు.

35వ వార్డు నుంచి..

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కనకరెడ్డి ఆధ్వర్యంలో తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులు భారీగా ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా కనకరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారంగా విద్యార్థులకు ఫీజు రీయింబర్‌మెంట్స్, వసతి, విద్యా దీవెన, నిరుద్యోగులకు రూ. 3 వేల భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ విశాఖ సిటీ సెక్రటరీ ఎ. ఆదివిష్ణురెడ్డి, సౌత్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, సౌత్ పబ్లిక్ వింగ్ అధ్యక్షుడు జీరు సుర్యనారాయణ (సుధ), గంగాధర్, దుర్గాప్రసాద్, రవి, లండా సుధ, రమణ, సూరీడమ్మ, చిన్ని, లోకేష్ తదితరులుపాల్గొన్నారు.



29వ వార్డు నుంచి పీతల వాసు నేతృత్వంలో తరలి వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు



30వ వార్డు నుంచి తరలిన మహిళలు



34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలు



ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో తరలివెళ్తున్న 33వ వార్డు నాయకులు, కార్యకర్తలు

నిరుద్యోగ భృతి రూ. 3 వేలు ఇవ్వాలి..

కంచరపాలెం: ఎన్నికల ముందు యువతను మభ్యపెట్టి చంద్రబాబు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని జీవీఎంసీ 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ డిమాండ్ చేశారు. యువత పోరు నిరసన కార్యక్రమంలో భాగంగా వర్షాన్ని కూడా లెక్క చేయకుండా వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో భారీగా జిల్లా పరిషత్ జంక్షన్ వద్ద గల కృష్ణ మందిరం వద్దకు చేరుకున్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్‌ను కలిసి నినాదాలు చేశారు. ముందుగా జ్ఞానాపురం మెయిన్‌రోడ్డులో నిరసన ర్యాలీని వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రారంభించారు.



35వ వార్డు నుంచి యువత పోరుకు ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, నాయకులు